
చుక్క నీరందని పల్లెలు

- బోథ్, కనుగుట్ట, కౌఠ(బి), కుచులాపూర్‌లో నీటి గోస
- ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు
- మల్టీ విలేజ్ స్కీం కింద నిధులు
- నత్తనడకన పనులు
- అధికారుల నిర్లక్ష్యం, పట్టింపులేని కాంట్రాక్టర్

పథకం పేరు: మల్టీ లెవల్ విలేజ్ స్కీం
ఖర్చు చేసిన నిధులు: రూ.6.30 కోట్లు
లబ్ధిపొందే గ్రామాలు: బోథ్, కనుగుట్ట, కుచులాపూర్, కౌఠ(బి)
ఇప్పటివరకు నీరు సరఫరా అయిన గ్రామాలు: 0


కరత్వాడ ప్రాజెక్టు వద్ద నిర్మించిన నీటి పథకం ట్యాంకు

బోథ్: అధికారుల నిర్లక్ష్యం.. ప్రభుత్వం పట్టింపులే నితనం వల్ల ప్రజలకు తాగునీరు దూరమైంది. ఆ నాలుగు గ్రామాలకు అందించాల్సిన మంచినీటి పథకం నీరుగారిపోయింది. మండలంలోని బోథ్, కనుగుట్ట, కౌఠ(బి), కుచులాపూర్ గ్రామాలకు తాగునీరందించాలనే ఉద్దేశంతో 2012లో కరత్వాడ ప్రాజెక్టు వద్ద మల్టీ విలేజ్ స్కీం పథకం కోసం రూ.5.50 కోట్ల నిధులు కేటాయించింది. 2014లో పనులు పూర్తి కావల్సి ఉంది. అధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్ల పట్టింపులేని కారణంగా పనులు నెమ్మదిగా సాగాయి. గత ప్రభుత్వం అంచనా వ్యయాన్ని రూ.6.30 కోట్లకు పెంచుతూ 2016వ సంవత్సరం వరకు గడువు ఇచ్చింది. అయినా పనులు నత్తనడకన సాగుతుండడంతో నీటి కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

అలా వేశారు..ఇలా తవ్వేశారు
గ్రామాలకు నీరందించాలనే ఉద్దేశంతో పైప్‌లైన్ వేశారు. రెండురోజుల్లోనే మిషన్ భగీరథలో భాగంగా చేపట్టిన తవ్వకాల్లో మల్టీ విలేజ్ స్కీం కోసం వేసిన పైప్‌లైన్లు ధ్వంసమయ్యాయి. మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మధ్య సమన్వయ లోపంతో ప్రజల ధనం మట్టిపాలైంది.

వృథాగా ట్యాంక్, పంప్‌హౌస్
తాగునీరందించడానికి ప్రవేశపెట్టిన మల్టీ విలేజ్ లెవల్ స్కీం పథకం ద్వారా కోట్లు వెచ్చించినా ఫలితం లేకపోయింది. గ్రామాలకు వేసిన పైప్‌లైన్‌లో నీటి జాడ కానరాలేదు. నిర్మించిన ట్యాంకు, పంప్‌హౌస్ వృథాగా ఉన్నాయి. గ్రామాలకు నీరు అందకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నీటి ట్యాంకు వద్ద మిషన్లు, పలు సామగ్రిని పలువురు ఎత్తుకెళ్లారు.

పథకంలో విలీనానికి పట్టని అధికారులు!
మల్టీ విలేజ్ స్కీం, మిషన్ భగీరథ పథకంలో ప్రభుత్వం విలీనం చేయాలని భావించినా.. అధికారులు పట్టించుకోకపోవడంతో అలానే ఉండిపోయింది. ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టిన పథకాన్ని భగీరథలో విలీనం చేయడం ద్వారా వేల లీటర్ల నీటి సామర్థ్యంతోపాటు నీటిని పంప్‌చేసే అవకాశం ఉంటుంది. పల్లెలకు తాగునీరును తీసుకెళ్లే అవకాశం ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో నీటి కొరత తీవ్రంగా ఉంది.

డబ్బులు వృథా అయ్యాయి


అధికారుల నిర్లక్ష్యంతో మల్టీ విలేజ్ స్కీం నిలిచిపోయింది. కోట్లు ఖర్చు చేసినా పల్లెలకు నీరందలేదు. ప్రజల డబ్బులు వృథా అయ్యాయి. బోథ్, కనుగుట్ట, కౌఠ(బి), కుచులాపూర్ గ్రామాలకు నీటిని సరఫరా చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలి.
– జక్కుల వెంకటేశ్, బోథ్

సాగునీటిని పొదుపుగా వాడుకోవాలి


జొన్న పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

తాంసి: ప్రస్తుతం భూగర్భ జలాలు తగ్గిపోతుండడంతో రైతులు సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ స్వామి పేర్కొన్నారు. తాంసి శివారులో సాగుచేసిన జొన్న, మక్క తదితర పంటలను మంగళవారం పరిశీలించారు. భూగర్భజలాలు తగ్గడంతో బోరుబావుల్లో నీరు రావడం లేదని, పంటలకు సాగునీరందని పరిస్థితి ఉందని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఉన్న నీటిని రైతులు వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. ఏవో రవీందర్, ఏఈవో నిఖిత, రైతులు గంగారెడ్డి, రాములు, స్వామి, దత్తు ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు


ఫార్మసీ గదిలో రికార్డులు పరిశీలిస్తున్న నరేందర్ రాథోడ్

గుడిహత్నూర్: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి నరేందర్ రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా.. లేదా? అని వైద్యుడు శ్యాంసుందర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోగులతో మాట్లాడారు. వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. ఫార్మసీ గదిలో మందుల స్టాకు వివరాలను పరిశీలించారు. మందుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీధర్ మెట్పల్లి ఉన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. మంగళవారం ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ద్వారాకనగర్‌లోని అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే మనకు జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కొవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాయినాథ్, సరిత, ఉమా, అరుణ తదితరులు పాల్గొన్నారు.

రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి


మాట్లాడుతున్న సెడ్మకి రామారావు

ఉట్నూర్‌రూరల్/ఇచ్చోడ/ఆదిలాబాద్‌టౌన్: ఇచ్చోడ మండల కేంద్రంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థిని లాలిత్య అనుమానాస్పదంగా మృతిచెందింది. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావు డిమాండ్ చేశారు. ఉట్నూర్ ప్రెస్‌భవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఘటనకు కారకులైన హెచ్‌ఎం, వార్డెన్‌లను అధికారులు వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. ఈ విషయమై పీవో దృష్టి సారించాలని లేకపోతే కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. నాయకులు భీంరావు, తొడసం ఇంద్రు తదితరులు ఉన్నారు. కాగా, బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానందం డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం ఇచ్చోడ ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులను సమస్యలను తెలుసుకున్నారు. ఆమె మృతిపై అధికారులు విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు అస్తక్ సుభాష్, రైల్వేబోర్డు సభ్యులు గణేశ్, మండల అధ్యక్షులు రమేశ్, కేంద్రే శివ ఉన్నారు. విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసం సచిన్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే పాయల్ శంకర్


ఎస్పీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అఖిల్ మహాజన్‌ను ఎమ్మెల్యే పాయల్ శంకర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసిన ఆయన శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు అంశాలపై వారు చర్చించారు. పోలీసు శాఖకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బీజేపీ నాయకులు ఆకుల ప్రవీణ్ లాలా మున్నా, జోగు రవి, రఘుపతి, రాజేష్, మహేందర్, భీంసేన్ రెడ్డి, రత్నాకర్ రెడ్డి, సూర్య కిరణ్, అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఎస్పీని మంగళవారం టీఎన్జీవో యూనియన్ ప్రతినిధులు కలిసి సత్కరించారు. సంఘం డైరీతోపాటు క్యాలెండర్‌ను ఎస్పీకి అందజేశారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు సంద అశోక్ ప్రధాన కార్యదర్శి ఎ.నవీన్‌కుమార్, నాయకులు తిరుమల్‌రెడ్డి, చంద్ర మోహన్‌రెడ్డి, రాజేశ్వర్, గంగాధర్, సంజీవ్ తదితరులు ఉన్నారు.
- ఎస్పీ అఖిల్ మహాజన్‌ను ఆయన కార్యాలయంలో సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు కలిసి శాలువతో సత్కరించారు. సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, సభ్యులు బండారి వామన్, గేడం మహాదేవ్, సూర్యకాంత్, కందుల రవీందర్, సత్యం, వేణు, నర్సోజీ, కిషన్, సతీశ్, సుభాష్ తదితరులు ఉన్నారు.
- చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు ఎస్పీ అఖిల్ మహాజన్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి మిఠాయి తినిపించారు. అధ్యక్షుడు కమల్‌కిషోర్ అగర్వాల్, ప్రధాన కార్యదర్శి గంద్రత్ సంతోష్ ఉన్నారు.

పోలీసుస్టేషన్ల తనిఖీ


ఆదిలాబాద్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌రూరల్: పెట్రోలింగ్ నిర్వహిస్తూ నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మావల, ఆదిలాబాద్ రూరల్ పోలీసుస్టేషన్లను మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్లలో రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలపై ఆరా తీశారు. పెట్రోలింగ్ నిర్వహిస్తూ రౌడీషీటర్ల కదలికలను పరిశీలిస్తూ ఉండాలన్నారు. అనంతరం మావల స్టేషన్ ఆవరణలో ఎస్పీ మొక్కను నాటారు. ఆదిలాబాద్ రూరల్ స్టేషన్ ఆవరణలో ఉన్న అనవసర వాహనాలను సంబంధించి చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి, రూరల్ సీఐ ఫణిధర్, ఎస్సైలు ముజాహిద్, గౌతమ్ ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ


ఉట్నూర్‌రూరల్: చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి: పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవిలో గ్రామాల్లో నీటి సమస్య రాకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఉట్నూర్‌రూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 66 మందికి లబ్ధిదారులకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. పేదలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వెడ్మ ఫౌండేషన్‌కు యూత్ కాంగ్రెస్ నాయకులు సల్లు భాయ్ రూ.50 వేల విరాళాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. సోషల్‌మీడియా కోఆర్డినేటర్ మోమీన్, నాయకులు పాల్గొన్నారు.

గమ్యాన్ని చేరుకునేలా కృషిచేయాలి
జీవితంలో నిర్దిష్ట మార్గదర్శకంలో నడుస్తూ గమ్యాన్ని చేరుకునేలా విద్యార్థులు కృషిచేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్, విద్యార్థులకు పోటీ పరీక్షలకు, జనరల్ స్టడీస్, గణితం, ఇంగ్లిష్, రీజనింగ్ అనే అంశాలపై మంగళవారం నిర్వహించిన వంద రోజుల శిక్షణలో పాల్గొన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్, సాయిప్రసాద్, నర్సింగ్, చంద్రశేఖర్, రాణి, కరుణాకర్, రవీందర్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నిర్మాణ్ సంస్థ సేవలు భేష్

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


క్రీడా విద్యార్థులకు సామగ్రి అందిస్తున్న ఐటీడీఏ పీవో, సంస్థ ప్రతినిధులు

ఉట్నూర్‌రూరల్: మారుమూల గిరిజన ప్రాంతాల్లో నిర్మాణ స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలు భేష్ అని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా కొనియాడారు. ఉట్నూర్ పీఎంఆర్సీలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడా విద్యార్థులకు స్పోర్ట్స్ పరికరాలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన గ్రామాలను దత్తత తీసుకుని మౌలిక సదుపాయాలు అందించడం అభినందనీయమన్నారు. క్రీడల్లో రాణిస్తున్న గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులకు రూ.లక్ష విలువైన క్రీడా సామగ్రిని అందించారని కొనియాడారు. సంస్థ సీనియర్ మేనేజర్ మనోహర్, మేనేజర్ మహేశ్, సాయి, రాహుల్, ఏసీఎంవో భాస్కర్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, దేవ్‌రావు, ఉత్తం, హేమంత్, కోచ్‌లు సునంద్, శివకృష్ణ, శేఖర్ ఉన్నారు.

ఐటీడీఏ పీవోకు సన్మానం
ఉట్నూర్‌రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం ఐటీడీఏ అధికారులు, సిబ్బంది ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ శాలువతో సన్మానించారు. ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రిమ్స్‌లో వైద్యపోస్టులకు 18న ఇంటర్వ్యూ

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ వైద్యుల పోస్టుల భర్తీ కోసం ఈనెల 18న వాక్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ప్రకటనలో తెలిపారు. గౌరవ వేతనంతో కూడిన కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సూపర్ స్పెషా లిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు, సీనియర్ రెసిడెంట్లు, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, సీఎంవో పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 18న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రిమ్స్‌లో నిర్వహించనున్న ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

ఫలితాలు నిలుపుదల చేయాలని నిరసన దీక్ష


నిరసన దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు

ఉట్నూరురూరల్: ఎస్సీ వర్గీకరణ అమలు చేసేవరకు గ్రూప్–1,2,3తో పాటు అన్ని ఫలితాలు నిలుపుదల చేయాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. రాష్ట్ర కార్యదర్శి కాంబ్లే బాలాజీ, నియోజకవర్గ ఇన్‌చార్జి గజ్జల కాంతరాజ్‌కుమార్, రాంప్రసాద్, అశోక్, బాలాజీ, విష్ణు, నాయకులు పాల్గొన్నారు.

వరల్డ్‌బుక్ రికార్డులో చోటు


సామంత్‌కుమార్ అభినందిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: మండలంలోని గోదారిగూడకు చెందిన బోర్లకుంట బుచ్చన్న, చంద్రకళ దంపతుల కుమారుడు సామంత్‌కుమార్ వరల్డ్ బుక్ రికార్డులో చోటు దక్కించుకున్నాడు. ఉట్నూర్‌లో చాలెంజ్ డ్యాన్స్ అకాడమీని ఏర్పాటు చేసి మూడేళ్లుగా పరిసర ప్రాంతవాసులకు క్లాసికల్, వెస్టర్న్, ఫోక్, సాల్సా, కొంటెపోరరీ, జుంబ, ఏరోబిక్స్ తదితర డ్యాన్స్ నేర్పుతున్నాడు. కొందరు పిల్లలు పలుచోట్ల పోటీల్లో పాల్గొని ప్రతిభచాటారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఆయనకు వరల్డ్ బుక్ రికార్డులో చోటుదక్కింది. ఆయన్ను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ వేర్వేరుగా అభినందించారు. కార్యక్రమంలో ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన వడ్డెర సంఘం నాయకులు


ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో నాయకులు

నేరడిగొండ: మండల వడ్డెర సంఘం నాయకులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండల కేంద్రంలోని ఆయన నివాసంలో కలిసి శాలువతో సన్మానించారు. అనంతరం వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరిస్తానని హామీఇచ్చారు. నాయకులు బొంతుకుల శ్రీను, కుంచపు గోవింద్, గోగుల సీతారాం, బోదాసు నరేశ్, శివరాత్రి శేఖర్, మల్లేశ్, బోదాసు రవి, రాములు, హనుమంతు, సాయిలు, నర్సయ్య, పోశెట్టి, నర్సింలు, లింగయ్య తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

తాంసి: సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు భీంపూర్ మండల ప్రత్యేక అధికారి కిషన్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ప్రజావాణి బహిరంగ విచారణ ప్రజావేదిక నిర్వహించారు. మండలవ్యాప్తంగా వచ్చిన వివిధ దరఖాస్తులపై ప్రత్యేకాధికారి విచారణ చేపట్టారు. మొత్తం 54 దరఖాస్తులు రాగా వాటిపై విచారణ చేపట్టారు. దరఖాస్తుదారులు, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి వారి సమస్య పరిష్కరించారు. ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, తహసీల్దార్ నలందప్రియ పాల్గొన్నారు.

వ్యవసాయానికి రూ.లక్ష కోట్లు కేటాయించాలి

ఇచ్చోడ: రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రూ.లక్ష కోట్లు కేటాయించాలని రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు సంగెం బొర్రన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది వ్యవసాయం సంక్షోభంలో ఉందన్నారు. పూర్తి స్థాయిలో పంట రుణమాఫీ కాకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో నకిలీ విత్తనాలు సరఫరా కాకుండా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

బోరు ప్రారంభం

బోథ్: మండల కేంద్రంలోని 14వ వార్డులో నీటి సమస్య ఉండటంతో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి బోరు వేయించారు. మంగళవారం బోరును ప్రారంభించారు. నాయకులు పసుల చంటి, నాయకులు తదితరులు ఉన్నారు.

మాన్కాపూర్‌లో పశువైద్యశిబిరం

నార్నూర్: ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని మాన్కాపూర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తమ్, వైస్ చైర్మన్ సోయం మారోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి వంశీకిరణ్ పశువులకు వైద్యం అందించారు. డైరెక్టర్ కైలాస్‌నాయక్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేడు డిజిటల్ పేమెంట్స్‌పై సదస్సు

ఉట్నూర్‌రూరల్: మండలకేంద్రంలోని కుము రం భీం ప్రాంగణం పీఎంఆర్సీ సమావేశ మందిరంలో డిజిటల్ పేమెంట్స్‌పై బుధవారం అవగాహన సదస్సు ఉంటుందని టీజీబీ మేనేజర్ సాకేత్ తెలిపారు. ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు హాజరు కావాలని కోరారు.

క్లుప్తంగా

ఇందిరమ్మ మోడల్ హౌస్ పనులు పూర్తి చేయండి

తలమడుగు: మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ పనులు త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ రాజ్‌మోహన్ అన్నారు. మంగళవారం నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మండలంలో నూతనంగా ప్రారంభించనున్న ఇళ్ల నిర్మాణ పనులకు ప్రభుత్వ ఆదేశాలతో ఇసుక అందిస్తామన్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ నసీర్, తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత


పీఠాధిపతి శేఖర్ మహారాజ్‌ను సన్మానిస్తున్న భక్తులు

నార్నూర్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని మహారాష్ట్రలోని పొరాదేవి పిఠాదిపతి శేఖర్ మహారాజ్ అన్నారు. మండల కేంద్రంలోని విజయ్‌నగర్ కాలనీలో కళాకారుడు ఆడే వసంత్ ఇంట్లో మంగళవారం నిర్వహించిన పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు ఆయన్ను సన్మానించారు. మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేశ్ తదితరులు ఉన్నారు.

ఆలయ వార్షికోత్సవం


పూజలు నిర్వహిస్తున్న మాజీ జెడ్పీటీసీ రాజు, గ్రామస్తులు

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామంలో 42 అడుగుల అభయాంజనేయ స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మాజీ జెడ్పీటీసీ రాజు, గ్రామస్తులతో కలిసి పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. గ్రామపెద్దలు అశోక్, రఘు, రమణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పకడ్బందీగా చేపట్టాలి


పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రమేశ్

బోథ్: మండలంలోని నక్కలవాడ పంచాయతీ పరిధిలో ఉపాధిహామీ పనులను ఎంపీడీవో రమేశ్ మంగళవారం పరిశీలించారు. ఉపాధి హామీ పనులను పకడ్బందీగా చేపట్టాలన్నారు. పనుల్లో కొలతలే ప్రామాణికంగా తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామస్తులు ఎంపీడీవోను సన్మానించారు.

ఇప్పపువ్వుకు పూజలు


పూజలు చేస్తున్న ఆదివాసీలు

బోథ్: సొనాల మండలంలోని పార్డి(కె) గ్రామంలో ఆదివాసీలు మంగళవారం ఇప్పపువ్వుకు పూజలు నిర్వహించారు. ఇప్ప పువ్వు సేకరణ ప్రారంభించడానికి ముందు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. పటేల్ అమృత్ రావు, దేవారి జైతు, మేసరం భూమన్న, అనిల్ తదితరులు ఉన్నారు.

రేపు హోలీ జరుపుకోవాలి

ఆదిలాబాద్: ఈనెల 13న హోలీ పండుగను జరుపుకోవాలని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతియోగానంద సరస్వతి స్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని గోపాలకృష్ణ మఠంలో మంగళవారం ఆయన మాట్లాడారు. కామదహనం గురువారం రాత్రి 12 లోపు చేయాలని, అనంతరం శుక్రవారం హోలీ జరుపుకోవచ్చని పేర్కొన్నారు. సనాతన హిందూ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శి మాధవ్, సభ్యులు రవీందర్, రావుల వేణు, సుభాష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గంటల నుండి రాత్రి 8.00 గంటల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899